నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, బుధవారం 13 నవంబర్ 2024 YADADRI BHUVANAGIRI



మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా విశేషపూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

## నేడు మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం

వలిగొండ, నవంబర్12 : మండలంలోని వెంకటాపురంలో గల మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 11 గంటలకు స్వామివారి తిరుకల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కొమ్మారెడ్డి నరేశ్‌రెడ్డి, ఈఓ మోహన్‌బాబు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ద్వారాతోరణం, ధ్వజకుంభ ఆరాధన, మూర్తి కుంభ ఆరాధన, చతుస్థానార్చన, నిత్యాహోమాలు, పూర్ణాహుతి, స్వామి వారి సకల స్నపనం, బలిహరణం నివేదన, తీర్థప్రసాద గోష్ఠి తదితర కార్యక్రమాలను పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



లక్కారంలో ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- ధరణి సమస్యలను త్వరగా పరిష్కరించాలి
- ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వద్దు
- కలెక్టర్ హనుమంతరావు

చౌటుప్పల్, నవంబర్ 12 : ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హనుమంత రావు అన్నారు. చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధరణి పెండెంగ్ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. డివిజన్ పరిధిలో ఇటివల నెలకొన్న 261ధరణి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ధరణి, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల దరఖాస్తులను స్వతరమే అందించే విధంగా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఆనంతరం కొనుగోలు కేంద్రాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమదారుల నుంచి స్థలాలను స్వాధీనం చేసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. హెచ్ఎండీఏ, జీపీ లేఅవుట్ల 10శాతం భూములపై నివేదిక తయారు చేసి సంబంధిత శాఖలకు అందిస్తామని తెలిపారు. చెరువు శిఖం భూముల ఆక్రమణపై కూడా సర్వే చేస్తామని చెప్పారు. వరిధాన్యం కొనుగోళ్లపై క్షేత్రస్థాయి అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మిలర్లు ట్రాన్స్‌పోర్టుకు సహకరించాలన్నారు. అన్‌లోడింగ్‌లో ఆలస్యం చేస్తే ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టి తొలగిస్తామని తెలిపారు. చివరి గింజవరకు ధాన్యం కొంటామని, రైతులు ఆధైర్యపడవద్దని ఆయన సూచించారు. ఆనంతరం మున్సిపాలిటీపరిధి లక్కారం గ్రామంలోని 8వార్డులో ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. ఎన్యుమరేటర్లను సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు. పొరపాట్లాకు తావులేకుండా ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ రేషన్‌కార్డు, ఆధార్, పట్టాదారు పుస్తకాలు అందుబాటులో పెట్టుకుంటే సర్వే త్వరితగతిన పూర్తవుతుందన్నారు. జిల్లాలో 2.65 లక్షల ఇండ్లను సర్వే కోసం గుర్తించామని తెలిపారు. అక్కడ నుంచి పట్టణంలో సెరికల్చర్ రూర్బన్ సిల్క్ రీలింగ్ యూనిట్ కలెక్టర్ సందర్శించారు. పట్టుదారాన్ని తీసే విధానాన్ని కార్మికులను అడిగితెలుసుకున్నారు. అనంతరం మండలపరిధిలోని జైకేసారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తాసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి, ఏఓ ముత్యాల నాగరాజు, ఆర్ఐలు బాణాల రాంరెడ్డి, సుధాకర్ రావు తదితరులు ఉన్నారు.

## రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

భువనగిరి అర్బన్, నవంబర్ 12 : రాష్ట్ర 57వ జాతీయ గ్రంథాల వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20 వరకు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ గంగాధర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10: 30 గంటలకు జాతీయ పతాకావిష్కరణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 15న పుస్తక ప్రదర్శన, సభ్యత్వ నమోదు, 16న గ్రంథాలయాలు- ప్రాముఖ్యత, ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 17న కవి సమ్మేళనం, 18న చిత్రలేఖనం, 19న పర్యావరణం, వాతావరణ మార్పుపై ఉన్నత పాఠశాల విద్యార్థులకు, 20న మహిళా దినోత్సవం, అనంతరం ముగింపు సమావేశంలో బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. ఈ వారోత్సవాల్లో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలకు ప్రతి పాఠశాల నుంచి 5 మంది విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకొని పోటీల్లో పాల్గొనే విద్యార్థుల పేర్లను 14వ తేదీ వరకు జిల్లా గ్రంథాలయ ఇన్‌చార్జి సుధీర్ బాబుకు పంపాలని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# పాడి రైతులపై పంజా

**కాంగ్రెస్ వచ్చాక రెండు సార్లు పాల సేకరణ రేట్ల తగ్గింపు**



ఆలేరు మండలం కొలనుపాక పాల కేంద్రంలో పాలు పోస్తున్న రైతులు

- ఇటీవల ధరలను తగ్గించిన మదర్ డెయిరీ
- లీటరుపై సుమారు రూ. నాలుగున్నర ధమాల్
- నాడు బీఆర్ఎస్ హయాంలో భారీగా పెంపు
- ప్రైవేట్ డెయిరీలు కూడా తగ్గుముఖం
- రోజురోజుకూ పెరుగుతున్న దాణా ధరలు
- తీవ్రంగా నష్టపోతున్న పాడి రైతులు

పాడి రైతులపై ప్రభుత్వ సంస్థ మదర్ డెయిరీ పంజా విసురుతున్నది. అడ్డగోలుగా పాల సేకరణ ధరలను తగ్గిస్తూ రైతుల నడ్డి విరుస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మూడు సార్లు తగ్గించగా, గత మూడు నెలల్లోనే రెండు సార్లు దించి పరేషాన్ చేస్తున్నది. ఫలితంగా కర్షకులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరోవైపు పశువుల దాణా రేట్లు మాత్రం రోజురోజుకూ ఆకాశన్నంటుతున్నాయి. ఇక నాలుగు పాల బిల్లులు కూడా పెండింగ్‌లో మూలుగుతున్నాయి.

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ)

యాదాద్రి భువనగిరి ప్రాంత రైతులు అధికంగా పాడి పరిశ్రమపైనే ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారు. జిల్లాలో 69వేల ఆవులు, లక్షకు పైగా గేదెలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 22 మదర్ డెయిరీ పాలశీతలీకరణ కేంద్రాలు ఉన్నాయి. పాల సొసైటీల్లో 32వేల మంది వరకు సభ్యులు ఉన్నారు. ప్రతి రోజూ సుమారు 50వేల లీటర్ల వరకు విక్రయిస్తున్నారు. మదర్ డెయిరీ మినహా మిగిలిన పాలను ప్రైవేట్ డెయిరీలకు అమ్ముతున్నారు.

### ప్రైవేట్ డెయిరీలు కూడా తగ్గుముఖం..

గతంలో మదర్ డెయిరీ, విజయ డెయిరీల కంటే ఎక్కువగా చెల్లించే ప్రైవేట్ డెయిరీలు సైతం ధరలను భారీగా తగ్గించాయి. ప్రైవేట్ డెయిరీలు లీటరుకు రూ. 8 నుంచి 10 తగ్గించాయి. హెరిటేజ్ గతంలో 3శాతం ఫ్యాట్ ఉన్న ఆవు పాలకు రూ. 40 నుంచి రూ. 42 చెల్లించేది. ఇప్పుడు రూ. 33 మాత్రమే చెల్లిస్తున్నది. 5శాతం ఫ్యాట్ వచ్చే గేదె పాలకు గతంలో లీటరుకు రూ. 50 పైగా చెల్లించగా, ఇప్పుడు రూ. 40 మాత్రమే ఇస్తున్నది. ఇతర డెయిరీలదీ ఇదే విధంగా ఉంది.

గతేడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు సార్లు పాల సేకరణ ధరలు తగ్గించారు. గత మూడు నెలల్లోనే రెండు సార్లు ధరలు తగ్గడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆగస్టులో రూ. 3, అక్టోబర్‌లో రూ. 1.50 దించారు. మొత్తంగా లీటరు పాలపై రూ. నాలుగున్నర తగ్గించారు. ప్రస్తుతం 5శాతం ఫ్యాట్ ఉన్న గేదే పాలు లీటరుకు రూ. 38.50, నాలుగున్నర శాతం ఫ్యాట్ ఉన్న ఆవు పాలు లీటరుకు రూ. 36.20 కొనసాగుతున్నది. ఆవు పాల ధర గతంతో పోలిస్తే సుమారు 9 నుంచి 10 వరకు తగ్గినట్లు లెక్కలు చెబుతున్నాయి. అయితే మదర్ డెయిరీ ఎన్నికల్లో గెలిపిస్తే పాల రేట్ల పెంచడంతోపాటు రూ. 4 బోనస్ ప్రోత్సాహకంగా ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు ధరలను పాతాళానికి దించుతున్నది. కాగా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పాడి రైతులుకు మేలు చేసేలా చర్యలు తీసుకున్నది. పాల ధరలను పెంచేందుకు క్రుషి చేసింది. గతేడాది ఏప్రిల్‌లో గేదె పాలకు లీటరుకు రూ. 6 పెంచిన విషయం అందరికీ తెలిసిందే.

**కాంగ్రెస్ వచ్చాక రెండు సార్లు తగ్గింపు..**

### నాలుగు బిల్లులు.. రూ. 20 కోట్లు పెండింగ్..

మదర్ డెయిరీలో ప్రస్తుతం నాలుగు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్కో బిల్లు రూ. 5 కోట్లు కాగా, మొత్తంగా రూ. 20 కోట్ల వరకు బిల్లులు రావల్సి ఉంది. రోజురోజుకూ బిల్లులు పెరుగుతూ పోతున్నాయి. ప్రభుత్వం నుంచి గ్రాంట్ తీసుకొచ్చి బిల్లులు చెల్లిస్తామని మదర్ డెయిరీ ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు చెప్పినా అడుగు ముందుకు పడలేదు. పాల బిల్లులు రాకపోవడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, పరిశ్రమ పరిస్థితి రోజురోజుకు దిగజారుగుతున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### పెరిగిన దాణా ధరలు..

ఓ వైపు పాల సేకరణ రేట్లు తగ్గిస్తుండగా, ఇంకో వైపు దాణా రేట్లు పెరిగిపోతుండటంతో రైతుల పరిస్థితి దుర్భరంగా మారింది. పత్తి, గోధుమ, తవుడు, పల్లీ, కంది, మక్క, శనగ, మినప, కొబ్బరి తదితర రకాల దాణారేట్లు భారీగా పెరిగాయి. ఇందులో ఏ దాణా కొనాలన్నా కిలోకు రూ. 50 దాకా ఖర్చు చేయక తప్పడంలేదు. 8 నుంచి 10 లీటర్ల పాలు ఇచ్చే ఆవు లేదా గేదెకు రోజుకు 5 కిలోల దాణా పెట్టాల్సి ఉంటుంది. అంతే కాకుండా పశుగ్రాసం అందించడంతోపాటు మందుల ఖర్చులు కూడా తప్పవు. ఇవన్నీ పోను రైతు కష్టం కలుపుకొంటే ఏమీ మిగలడంలేదు.

### పాల ధర పెంచుతామని చెప్పి మోసం చేశారు



అబద్ధపు మాటలతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మదర్ డెయిరీ చైర్మన్‌ను గెలిపించుకున్నారు. గెలిచిన తర్వాత లీటర్‌కు రూ.4 బోనస్ ఇప్పిస్తామని చెప్పి రూపాయిన్నర తగ్గించి అసలుకే ఎసరు పెట్టారు. గెలిచిన ఫస్ట్ బోర్డు మీటింగ్‌లోనే రూపాయిన్నర తగ్గించడం సిగ్గుచేటు. గెలువగానే రేటు పెంచుతామనే రైతులకు మాయమాటలు చెప్పి మోసం చేశారు. రైతులకు పాల బిల్లులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు.

**- దొంతిరి సోమిరెడ్డి, మాజీ మదర్ డెయిరీ డైరెక్టర్, ఆలేరు**

# అమాత్యా... జర ఇటు చూడుర్రి

## ధాన్యం, పత్తి కొనుగోళ్లలో తీవ్ర జాప్యం

- మద్దతు ధరకు ఎసరు... రైతన్నలను నిలువు దోపిడీ
- ప్రభుత్వ తీరుపై నిత్యం రోడ్లెక్కుతున్న రైతులు
- సమీక్ష పట్టని ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రులు
- కాంగ్రెస్ నేతల విజ్ఞప్తికి స్పందించని మంత్రులు
- ప్రభుత్వ పెద్దల తీరుపై రైతుల మండిపాటు

**వానకాలంలో పండించిన పంటలను అమ్ముకునేందుకు గత నెల రోజులుగా ఉమ్మడి జిల్లాలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఎటు చూసినా ఓ వైపు ధాన్యం రాశులు, మరోవైపు పత్తి బోరాలు కనిపిస్తున్నాయి. కానీ వాటికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలంటే సవాలక్ష కొర్రీలు ఎదురవుతున్నాయి. ఇటు మిల్లర్లు ధాన్యం రైతును, అటు సీసీఐ సెంటర్ల నిర్వాహకులు పత్తి రైతును దగా చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ఎలా ఎగనామం పెట్టడమే లక్ష్యమన్నట్లుగా వ్యవహరిస్తుండడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇలాంటి సమయాల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షిస్తూ అండగా నిలవాల్సింది ప్రభుత్వ పెద్దలే. గత కేసీఆర్ సర్కార్‌లో ప్రతి సీజన్‌లోనూ నాటి మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఇతర మంత్రులు జిల్లాల వారీగా స్థానిక ఎమ్మెల్యేలు, అధికార యంత్రాంగంతో సమీక్షించి కొనుగోళ్లు సజావుగా సాగేలా చర్యలు చేపట్టేవారు. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్‌లోని మంత్రులకు ఆ తీరిక దొరకడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కాంగ్రెస్ మీటింగ్‌లోనూ ఆ పార్టీ నేతలే కొనుగోళ్లపై వ్యక్తం చేసిన ఆవేదన వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. అయినా సరే జిల్లాలోని ఇద్దరూ మంత్రులతోపాటు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి కూడా ఉన్నా...నేటికి ఒక్కసారి కూడా పంటల కొనుగోళ్లపై సమీక్ష జరుపకపోవడం ఏంటని రైతులు మండిపడుతున్నారు.**

– నల్లగొండ ప్రతినిధి, నవంబర్12(నమస్తే తెలంగాణ)



మర్రిగూడ : పత్తి కొనుగోళ్లపై నిబంధనలతో యరగండ్లపల్లి లక్ష్మీనర్సింహ స్వామి కాటన్ మిల్లు ఎదుట రాస్తారోకో చేస్తున్న పత్తి రైతులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వ్యవహరిస్తున్నారు. ఇక నల్లగొండ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిగా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిగా ఉన్నారు. ఇందులో ఇన్‌చార్జి మంత్రి తుమ్మలతోపాటు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శాఖలు కూడా నేరుగా రైతులు, పంటల ఉత్పత్తులతో సంబంధం ఉన్న శాఖలే. అయినా సరే వీరిలో ఎవ్వరికీ కూడా నేటికి ఉమ్మడి జిల్లా పరిధిలో ధాన్యంగానీ, పత్తి కొనుగోళ్లపైగానీ సమీక్షించే తీరిక దొరకడం లేదు. రాష్ట్రంలోనే ఉమ్మడి నల్లగొండ జిల్లా ధాన్యం, పత్తి పంటల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉంది. ప్రస్తుతం ధాన్యం, పత్తి పంటలు మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. వడ్ల కొనుగోలు కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా దొడ్డురకం వడ్ల కొనుగోళ్లు ఓ మాదిరిగా జరుగుతుండగా సన్నవడ్లు మాత్రం ప్రభుత్వ నిబంధనలతో కేంద్రాలకు రావడం లేదు. దీంతో సన్నవడ్లను పండించిన రైతులు నేరుగా రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 6.81లక్షల ఎకరాల్లో సన్నాల సాగుకు అంచనా వేయగా 15.50లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని అంచనా వేశారు. ఇందులో ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి సన్నాలను రైతులు మిర్యాలగూడ ప్రాంతంలోని మిల్లులకే తీసుకువస్తున్నారు. ఇప్పటివరకు నాన్‌ఆయకట్టు సన్నాలు రాగా ఇక నుంచి సాగర్ ఆయకట్టులోని సన్నాలు మార్కెట్‌కు భారీ ఎత్తున రానున్నాయి. ఆరంభంలో రూ.2400 వరకు సన్నాలకు ధర చెల్లించిన రైస్‌మిల్లర్లు ధాన్యం భారీగా ముంచెత్తుతుండడంతో ఇదే అదునుగా ధరను తగ్గించి వేస్తున్నారు. రైస్‌మిల్లర్లు సిండికేట్‌గా మారి క్వింటాలు సన్నవడ్లకు రూ.2,150 నుంచి రూ.2,300 వరకే చెల్లిస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత వానకాలంలో అత్యధికంగా రూ.2,800 నుంచి రూ.3,150 వరక కొనుగోలు చేసిన మిల్లర్లు ప్రస్తుతం ధరను భారీగా తగ్గించడంలో రైతులు రగిలిపోతున్నారు. దీంతో రైస్‌మిల్లర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్లెక్కుతున్నారు. రైతుల ఆందోళనతో అధికారులు స్పందించడంతో మిల్లర్లు కొద్ది సేపు దిగి వస్తున్నా.. తర్వాత యథావిధిగా ధరలో కోతలు పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారు.

### పత్తి కొనుగోళ్లలోనూ కొర్రీలు

ఇక ఇదే సమయంలో పత్తి రైతులు సైతం నిలువు దోపిడీకి గురవుతున్నారు. జిల్లావ్యాప్తంగా 7 క్లస్టర్లలో 23 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు జరుపుతున్నట్లు ప్రకటించినా ఆచరణలో పరిస్థితి వేరుగా ఉంది. కొన్ని మిల్లులకే సీసీఐ అనుమతించడంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక కొనుగోళ్లు జరుపుతున్న జిన్నింగ్ మిల్లుల్లో సైతం తేమ పేరుతో సీసీఐ అధికారులు పత్తి కొనుగోళ్లల్లో కొర్రీలు పెడుతున్నారు. 8 నుంచి 12శాతం తేమ ఉంటేనే మద్దతు ధర రూ.7521లు చెల్లిస్తామంటున్నారు. కానీ ఇటీవల తుఫాన్ వర్షాల కారణంగా పత్తి నాణ్యతతో పాటు తేమ శాతం కూడా ఎక్కువగా ఉంటుండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో రైతులు విధిలేని పరిస్థితుల్లో గ్రామాల్లోని దళారులకు పత్తిని క్వింటాలుకు రూ.5,800 నుంచి రూ.6,300 వరకే విక్రయించాల్సి వస్తుంది. సీసీఐ తీరుతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సీసీఐ కేంద్రాల వద్ద నిత్యం పత్తి రైతుల ఆందోళనలు నిత్యకృత్యంగా మారాయి. రానున్న నెల రోజులు ధాన్యం, పత్తి పంటల దిగుబడి మరింత పెరగనుంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులకు అండగా నిలవాల్సి ఉంది. అధికారులు ఆడపాదడపా స్పందిస్తూ వారికి ఉన్న పని ఒత్తిళ్లతో పూర్తి స్థాయిలో దృష్టి పెట్టలేకపోతున్నారన్న చర్చ ఉంది.

### మంత్రులు అంత బిజీనా..

జిల్లా మంత్రులతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రికి కూడా రైతుల బాధలు పట్టనంత బిజీ ఏముంటుందన్న చర్చ జిల్లాలో జోరుగా సాగుతున్నది. పంటలు అమ్ముకునే సమయాల్లో రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ పెద్దలుగా మంత్రులకు ఎందుకు పట్టడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మద్దతు ధర రాక, కొనుగోళ్లు సజావుగా సాగక నిత్యం రైతులు రోడ్లెక్కుతున్న వార్తలు మీడియాలో వైరల్‌గా మారినా మంత్రులు స్పందించకపోవడం ఏంటని రైతులు మండిపడుతున్నారు. మరోవైపు నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశంలోనే ఆ పార్టీ నేతలు ధాన్యం రైతుల బాధలు వర్ణనాతీతం అంటూ... గత ప్రభుత్వంలో వారం రోజుల్లోనే ధాన్యం డబ్బులు పడేవని... జిల్లాకు చెందిన మంత్రే సివిల్ సప్లయ్ మంత్రిగా ఉన్నా నెల రోజులుగా పంటలు అమ్మకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అయినా జిల్లా మంత్రుల్లో చలనం లేకపాయే అని ఆ పార్టీ శ్రేణులే ఆరోపిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికే వానకాలం పంటలకు రైతుభరోసాకు ఎగనామం పెట్టారు... రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదు... పండించిన ధాన్యం మొత్తానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడేమో సన్నవడ్లకే అని మెలిక పెట్టారు. ప్రభుత్వ తో.డ్పాటు కరువైనా సరే.. పండించిన పంటల కొనుగోళ్లు సజావుగా జరిగేలా, వాటికి మద్దతు ధర లభించేలా చూడాల్సిన బాధ్యత జిల్లా మంత్రులు, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి లేదా అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




మధ్యాహ్న భోజనం చేస్తూ హాస్టల్ సమస్యలు తెలుపుతున్న విద్యార్థులు

## అన్నంలో పురుగులు వస్తున్నాయి

- నీళ్ల సాంబారు, మజ్జిగ పోస్తున్నారు..
- అపరిశుభ్రంగా మరుగుదొడ్లు
- ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను వెంటనే మార్చాలి
- విచారణ అధికారికి సమస్యలు తెలిపిన తుంగతుర్తి గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు

తుంగతుర్తి, నవంబర్ 12 : మండల కేంద్రంలోని గురుకుల బాలుర పాఠశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నది. కొన్ని రోజులుగా పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విద్యార్థులపై దురుసుగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో పాఠశాలకు మంగళవారం విచారణ అధికారిగా జనంపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజా విచారణ చేపట్టారు. ఈమేరకు పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులు చేరుకొని జరిగిన ఘటనను వివరించారు. అనంతరం విచారణ అధికారి అధ్యాపకులను, విద్యార్థులను వేర్వురుగా విచారణ చేయడంతో అందరూ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను తొలగించి రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించాలని కోరారు. ఈసందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని ఆయన ఖంగుతిన్నారు. కొన్ని రోజులుగా రెగ్యులర్ అధ్యాపకులు లేక పాఠశాలలో విద్యాబోధన సరిగా లేదని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేవని, అన్నంలో తరచూ పురుగులు వస్తున్నాయని, నీళ్ల సాంబారు, నీళ్ల మజ్జిగ పోస్తున్నారని, కొన్ని సందర్భాల్లో భోజనం సరిపోను అందడం లేదని విద్యార్థులు తెలిపారు. తమ సమస్యలపై కలెక్టర్ స్పందించి పరిష్కరించాలని వేడుకున్నారు. దీంతో సదరు వంట కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా పాఠశాలలో 550మందికిపైగా విద్యార్థులు ఉండగా వార్డెన్ సరిపోను సరుకులు ఇవ్వడంలేదని ఆరోపించారు. అనంతరం విచారణ అధికారి రాజా మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న సమస్యలపై విచారణ చేపట్టానని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నామని తెలిపారు.

## చందుపట్ల పీఏసీఎస్ పాలకవర్గంపై వేటు



ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 12 : చందుపట్ల పీఏసీఎస్ పాలకవర్గంపై ప్రభుత్వం వేటు వేసింది. సొసైటీ నిర్వహణ, నిధుల దుర్వినియోగం, పాలనా వ్యవహారాల్లో వైఫల్యం కారణంగా సొసైటీ చైర్మన్ మందడి లక్ష్మీనరసింహారెడ్డితోపాటు 11మంది డైరెక్టర్లను పదవుల నుంచి తొలగిస్తూ రాష్ట్ర సహకార సంఘాల సంచాలకులు, కోఆపరేటివ్ సొసైటీస్ రిజిస్ట్రార్ పి.ఉదయ్‌కుమార్ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సొసైటీ పరిపాలనా వ్యవహారాల నిర్వహణ బాధ్యతలను సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.వెంకట్‌రెడ్డికి అప్పగించగా.. ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పాలకవర్గంపై వచ్చిన అభియోగాలను పరిశీలించి నిబంధనల మేరకు పాలకవర్గాన్ని రద్దు చేశారన్నారు. పీఏసీఎస్ కార్యాలయ భవనం, గోదాం నిర్మాణం, పెట్రోల్ బంకు ఏర్పాటులో జరిగిన అవినీతి, అక్రమాలపై పాలకవర్గాన్ని పూర్తిగా తొలగించారని చెప్పారు. ఎన్నికలు నిర్వహించే వరకు తాను బాధ్యతలు చేపడుతానన్నారు.